క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు బొమ్మయ్యపల్లె దళితవాడ, రామకృష్ణాపురం, గ్యారంపల్లె, తిప్పినాయుడుపల్లె, తిప్పినాయుడు పల్లె దళితవాడ గ్రామాల్లో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి, సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు.

విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ శ్రీధర్‌రాజు

నింద్ర: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఈఓ శ్రీధర్‌రాజు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కొప్పేడు దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యా ర్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు అందరికి ఉన్నాయా? లేదా? అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరి రూరల్ సీఐగా శ్రీనివాసంతి



నింద్ర: నగరి రూరల్ సీఐగా శ్రీనివాసంతి సోమవారం నింద్ర కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఉన్న సీఐ రాజశేఖర్ చిత్తూరు వీఆర్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఈమె నగరి సీఐగా పని చేస్తుండగా, నగరి రూరల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

శరవేగంగా లీకేజీపై చర్యలు


పైపులైన్ పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నగరి: పట్టణ పరిధిలోని టవర్‌క్లాక్ సెంటర్‌లో పైపులైన్ లీకేజీ ఏర్పడడంతో మున్సిపల్ అధికారులు శరవేగంగా స్పందించి లీకేజీని అరికట్టారు. సోమవారం లీకేజీ ఉన్న ప్రాంతంలో గోతులు తీసి పెద్దపైపులైన్‌కు ఉన్న లీకేజీని సరి చేసి అరికట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ నరేష్ పనులను పర్యవేక్షించి పూర్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విజిలెన్స్ తనిఖీలు


పోషకాహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సీఐ

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం అప్పలాయగుంట పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటరవి తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరు, సరుకులు అందజేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మజ పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ


ప్రయాణికుడు ప్రభాకర్‌కు నగలను అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆర్టీసీ బస్సులో సోమవారం ప్రయాణించిన రిటైర్డు ఉపాధ్యాయుడు ప్రభాకర్ రూ.6 లక్షలు విలువైన నగల బ్యాగును మరచి వదలి వెళ్లి పోయాడు. బ్యాగును గుర్తించిన సదరు బస్సు కండక్టర్ వీసీ శేఖర్ పుత్తూరు డిపో ఏఎం(టి) మంగమ్మకు అందజేశాడు. అనంతరం డిపో వద్దకు వచ్చిన ప్రయాణికుడు ప్రభాకర్‌కు నగల బ్యాగును ఆర్టీసీ అధికారులు అందజేశారు. శేఖర్‌ను డిపో అధికారులు అభినందించారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని మండల తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 17 వినతులు వచ్చాయి.

చేనేత రంగాన్ని గౌరవిద్దాం


చేనేత వస్త్రాలు ధరించి వచ్చిన అధ్యాపకులు


ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మిక యూనియన్ నాయకులు

- బ్రిటీష్ పాలకుల కారణంగా దెబ్బతినింది చేనేత రంగం
- ఉద్యోగ కల్పనా రంగం కూడా ఇదే
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ వేణుగోపాల్

నగరి: చేనేత రంగాన్ని గౌరవించడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం కళాశాలలో సాంస్కృతిక విభాగం వారు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయం తరువాత అత్యధిక జనాభాకు ఉద్యోగ అవకాశాలు కల్పించే రంగం చేనేత అన్నారు. దీన్ని కాపాడుకోవడం, గౌరవించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అన్నారు. బ్రిటీష్ వారు భారతదేశంలో తీవ్రంగా దెబ్బతీసిన మొదటి వృత్తి చేనేత అన్నారు. వ్యవసాయం తరువాత రెండవ అతిపెద్ద ఉద్యోగ కల్పనా రంగమైన నేత పరిశ్రమను తమ ఎగుమతి, దిగుమతి విధానం ద్వారా బలహీనపరచడం కారణంగా కోట్లాది ప్రజలను పేదరికంలోకి నెట్టివేశారన్నారు. భారతదేశంలో నిరుద్యోగం లేకపోవడానికి, ఆర్థికంగా, పరిపుష్టిగా, స్వయం పోషకంగా ఉండడానికి కారణం చేనేత రంగమన్నారు. విద్యార్థులు చేనేత వృత్తులకు గత వైభవం వచ్చేలా, ప్రపంచం మెచ్చేలా చేయాలని పిలుపునిచ్చారు. చేనేత రంగంలో భారతీయుల నైపుణ్యం ప్రపంచం గర్వించదగిన స్థాయిలో ఉందన్నారు. అగ్గిపెట్టిలో ఇమిడిపోయే చీరను ఇప్పటికీ చెప్పుకోవడం మనం వింటూ ఉంటామని, శిల్పాలపై కూడా ఈ కళను సూచించే శిల్పాలను చెక్కారని, ఈ కళను వృత్తిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చేనేత వస్త్రాలను ధరించిన వారితో ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర రాజు, కళాశాల సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డా.అరుణ కుమారి, అధ్యాపకులు డా.స్వాతి, డా.శ్రీలక్ష్మి, డా.పంకజ, డా.రేవతి, డా.రెడ్డి నాయక్, డా.మహేశ్వరి, రామాంజులు, శివ లక్ష్మి, సురేష్, లాల్ భాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవ ర్యాలీ..

నగరి: మండలంలోని మాంగాడు గ్రామంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేవీ కుప్పయ్య మాట్లాడుతూ 2015 సంవత్సరం నుంచి కేంద్రప్రభుత్వం ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ రోజున అధికారులు నేత వస్త్రాలు ధరించి రావాలని ప్రభుత్వం ప్రకటించడం చేనేతకు దక్కిన గౌరవమన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు గోపాల్, కందల గేరటయ్య శెట్టి, వెంకట రత్నం శెట్టి, సంజీవి, శేఖర్, శ్రీనివాసులు, సుధాకర్, లక్ష్మీపతి, మోహన్, జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రాజద్రోహం కేసు పెట్టాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలసముద్రం: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్న మాజీ సీఎం చంద్రబాబుపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం వారు మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో చంద్రబాబు రాజకీయ ఉన్మాదిలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా టీడీపీకి ఘోర పరాభావం తప్పదన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేస్తున్న అభివృద్ధి పనులు టీడీపీ నాయకులకు కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రాజు, గోపి, పయణి, బాబు, వరదరాజు, సిద్దమండడి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నేతలు

నగరి: ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు దళిత సంఘాల నాయకులు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఘన నివాళి అర్పించారు. సోమవారం బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి నివాళులు అర్పించడంతో పాటు అంబేద్కర్ యువజన సంఘం నాయకులతో గద్దర్‌తో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఆయన శ్రమించిన తీరు ఒక చరిత్రగా మిగిలిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంకే ప్రకాష్, కార్యదర్శి గోవింద్ స్వామి, మాజీ వైస్ చైర్మన్ బాబు, అంబేద్కర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు


కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కార్వేటినగరం: మండలకేంద్రంలో ప్రసిద్ధ చెందిన శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారిని డీసీసీ బ్యాంకు జిల్లా చైర్మన్ మొగసాల రెడ్డెమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి సోమవారం దర్శించుకున్నారు. వేద పండితులు వేద మంత్రాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనలు అందించి దీవించారు. అలాగే స్వామివారి ప్రసాదాలు అందించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సొసైటీ సీఈఓ దుష్యంత్‌రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుంజయవర్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, డీసీసీ బ్యాంకు మేనేజర్ వహిద కృష్ణమూర్తిని శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.

భక్తులకు అన్నదానం


ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి: మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంగా ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఆనంద్ అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.




అమ్మవారి ఎదుట అగ్గి తొక్కుతున్న భక్తులు, పుష్పపల్లకిపై పురవీధుల్లో ఊరేగుతున్న అమ్మవారు

తిరునాళ్లు ముగింపు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రంలో వార్షిక తిరునాళ్లు సోమవారంతో వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారధనలు చేశారు. సాయంత్రం కాపుకట్టిన భక్తులు పూల గెరిగెతో తొమ్మిది బావులు నీటిని తీసుకుని గ్రామాల్లో పంబ వాయిద్యాలతో ఊరేగించి అమ్మవారిని వేదపండితులచే అభిషేకించారు. కాపుకట్టిన భక్తులు అమ్మవారి ఎదుట అగ్నిగుండంలో అగ్గి తొక్కి మొక్కులు తీర్చుకున్నారు. పుష్పపల్లకిలో అమ్మవారిని సుందరంగా అలంకరించి బాణసంచా పేల్చుతూ పురవీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటా మహిళలు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు.

ఉచిత శిక్షణకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ పాస్, ఏదైనా డిగ్రీ కలిగిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఈనెల 15వ తేదీ లోపు https://forms.gle/-FmvqcyRhuzjovpbh9 లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. వివరాలకు 630095441 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి






మృతులు బి.కృష్ణయ్య, బి.నందకుమారి (ఫైల్), గాయపడిన గౌతం, బద్రి, రమేష్

- ఒకేరోజు మూడు రోడ్డు ప్రమాదాలు
- భార్యాభర్తలు దుర్మరణం, నలుగురికి తీవ్ర గాయాలు

పుత్తూరు రూరల్: పుత్తూరు పరిసర ప్రాంతాల్లో సోమవారం జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు దుర్మరణం చెందగా, నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. పుత్తూరు బైపాస్ రోడ్డులోని తొరూరు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు మోటర్ సైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో తొరూరుకు చెందిన మాజీ సర్పంచ్ బి.కృష్ణయ్య(75), బి.నందకుమారి(65) మృతి చెందారు. వీరు తొరూరు గ్రామం నుంచి పుత్తూరుకు మోటర్ సైకిల్‌పై వస్తుండగా రేణిగుంట జ్యోతినగర్‌కు చెందిన సంజీవి(33) బుల్లెట్‌పై నారాయణవనానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సంజీవి తీవ్రంగా గాయపడగా తిరుపతి రుయాకు తరలించారు. మరో ప్రమాదంలో పుత్తూరు కాపువీధికి చెందిన గౌతం(28), బద్రి(30) మోటర్ సైకిల్‌పై పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళ్తూ అదుపుతప్పి గోడను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరికి పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. పుత్తూరు రూరల్ మండలం శిరుగురాజు పాళెం క్రాస్ రోడ్డు వద్ద వడమాలపేట మండలం ఎస్బీఆర్‌పురం ఏఏడబ్ల్యూకు చెందిన రమేష్(45) మొపెడ్‌పై రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి తిరుపతికి వెళ్తున్న 201 బస్సు(టిఎన్21ఎన్2180) ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు మూడు ప్రమాదాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


వైఎస్సార్ బీమా అందిస్తున్న నాయకులు

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, మిట్టవీధికి చెందిన విడి మూర్తి ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకానికి అర్హత ఉండడంతో ఆయన భార్య వీఎం గీతకు రూ.లక్ష అందింది. సోమవారం ఈ మొత్తాన్ని బాధితురాలికి రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈవీ బాలకృష్ణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, నాయకులు జగన్నాథం అందించారు.

వైభవంగా పట్టాభిషేక ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి

నగరి: మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడలో నిర్వహిస్తున్న తిరనాళ్లలో భాగంగా సోమవారం పట్టాభిషేక ఉత్సవం ఆపై వసంతోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామిని పట్టువస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- అధికారం కోసమే చంద్రబాబు అల్లర్లు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించి తద్వారా పేదరికాన్ని నిర్మూలించాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం మండలంలోని బొమ్మయ్యపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని తెల్లగుండ్లపల్లె ఎస్టీ కాలనీ, కొత్త ఇండ్లు, తెల్లగుండ్లపల్లె దళితవాడ, తెల్లగుండ్లపల్లె, మనవర్తికొత్తూరు, తెట్టుగుండ్లపల్లె, తోటానుపల్లె, జడబాపనపల్లె, మత్రిపల్లె, బీసీ కాలనీ, దేవళంపేట గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన, ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. అందుకే సీఎం జగనన్న పేదల గుండెల్లో పదిలంగా నిలిచారని కొనియాడారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతూ, అల్లర్లకు ఆజ్యం పోస్తున్న చంద్రబాబు టెర్రరిస్టులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పుంగనూరులో భయానక వాతావరణాన్ని సృష్టించి మంత్రి పెద్దిరెడ్డిని కట్టడి చేయాలన్న చంద్రబాబు ఆలోచన దుర్మార్గమన్నారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలి

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలను పూర్తి చేసేందుకు వెలుగు ద్వారా రుణాలు ఇవ్వాలని వెలుగు ఏపీఎం కవితను ఆదేశించారు. అంతకు ముందు తిరుమలయ్యపల్లె పంచాయతీ షికారి కాలనీలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, గాండ్లకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పురుషోత్తం, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ చెంగల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు చొక్కా గోవిందయ్య, భారతి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు వెంకటేష్, నాయకులు ధనుంజయరెడ్డి, మునికృష్ణారెడ్డి, రోశిరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనస్సు ప్రారంభం


వైద్యసిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి డాక్టర్ రావిరాజు

శ్రీరంగరాజపురం: మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం ఈ నెల 7వ తేదీన ప్రారంభమై 15 వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రావిరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని గిడ్డమహారాజపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ బాలింతులు, ఐదేళ్లలోపు ఉన్న పిల్లలు ఎవరైనా పెన్‌టవలెట్, టీటీ, డీపీటీ, న్యూమోకోకల్, ఐపీవీ తదితర టీకాలు వేసుకోకపోతే వెంటనే ప్రాథమిక వైద్యకేంద్రానికి వెళ్లి టీకా వేయించాలన్నారు. వైద్యసిబ్బంది అలాంటి వారిని గుర్తించి వారికి ప్రేరణ కల్పించాలని తెలిపారు. అనంతరం ముగ్గురు బాలింతలకు, 16 మంది పిల్లలకు జిల్లా ఇమ్యునేజేషన్ అధికారి రావిరాజు టీకాలు వేశారు. కార్యక్రమానికి మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి, సందీప్‌రాజు, నర్స్ గంగాదేవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే చంటిబిడ్డలకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్, విజయపురంలో ..

నగరి: తల్లిపాలు చంటిబిడ్డలకు వ్యాధినిరోధక శక్తిని ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చింతామణి అన్నారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవ ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని ఇస్తుందన్నారు. ముర్రుపాలు పిల్లలకు విధిగా పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం ప్రమీళ, అంగన్‌వాడీ కార్యకర్తలు సలీమా, తల్లులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి): తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, తల్లిపాలు తీసుకునే బిడ్డలు మంచి ఆరోగ్యకరంగా ఉంటారని డాక్టర్ సోమశేఖర్ అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లి పాలవారోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

నింద్ర: బిడ్డ పుట్టిన ఆరునెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, అవే బిడ్డకు శ్రేయస్కరం అని డాక్టర్ కల్యాణి అన్నారు. సోమవారం ఎంపీపీ దీప అధ్యక్షతన నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల తర్వాత పౌష్టికాహారం ఇవ్వడం మొదలు పెట్టినా, తల్లిపాలు ఇవ్వడం ఆపకూడదన్నారు. రెండేళ్ల వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలన్నారు.

నగరి సీఐగా సురేష్


సీఐ సురేష్

నగరి: నగరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బీఎస్ సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో సీఐగా ఉన్న శ్రీనివాసంతి బదిలీపై నగరి రూరల్ స్టేషన్ నింద్రకు వెళ్లడంతో వాయల్పాడు నుంచి బదిలీపై బీఎస్ సురేష్ విచ్చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని, శాంతిభద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజల సహకారం అవసరమన్నారు. నగరి పట్టణం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున అక్కడి నుంచి ఇక్కడకు విచ్చేసి నేరాలకు పాల్పడే వారిపైన ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

కార్వేటినగరం: స్థానిక ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనట్లు ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ చిరంజీవిరెడ్డి గతేడాది మార్చిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఖాళీగా ఉన్న ఈ సర్పంచ్ స్థానానికి ప్రభుత్వం విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఉప ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 8వ తేదీ మంగళవారం ఉదయం 10.30 నుంచి 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే 11వ తేదీ 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 12వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం వరకు ఉప సంహరణకు అవకాశం ఉంటుందని, 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. అదే విధంగా కత్తెరపల్లిలో 4వ వార్డుకు కూడా ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గిద్దమాకరాజపురం 8వ వార్డు, తయ్యూరు 5వ వార్డు, శ్రీరంగరాజపురం 12వ వార్డు, నెలవాయి 5వ వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 11వ తేదీ నామినేషన్ పరిశీలించి, 14వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం ఉందన్నారు. 19వ తేదీ పోలింగ్, అదే రోజు 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామన్నారు.

గంగాధరనెల్లూరులో..


ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: మండలంలో ఖాళీగా ఉన్న పలు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు ఎంపీడీఓ శ్రీదేవి అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని నెల్లెపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మన్నారయ్య, గతేడాది ఆగస్టులో తన వ్యక్తిగత కారణాల చేత సర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉందన్నారు. ఈ స్థానానికి ఉప ఎన్నిక జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని కొండేపల్లి 2వ వార్డు, గంగాధరనెల్లూరు 9వ వార్డు, వరత్తూరు 2వ వార్డు మెంబర్ల స్థానాలకు కూడా ఎన్నికలు జరుగుతాయన్నారు.